AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com



## టీఆర్ఎస్ ఎల్లారెడ్డి మండలాధ్యక్షుడిగా మర్రి బాలయ్య




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** టీఆర్ఎస్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడిగా మర్రి బాలయ్య ముదిరాజ్‌ను నియమిస్తున్నట్లు ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎదురుగట్ల సంపత్ గౌడ్ తెలిపారు. ఈమేరకు శనివారం నియామకపత్రం అందజేశారు. పార్టీ పట్ల మర్రి బాలయ్య ముదిరాజ్ చూపుతున్న నిబద్ధత, అంకితభావం, కార్యకర్తలతో సమన్వయం, ప్రజా సమస్యలపై ఆయన చురుకైన వైఖరిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.


1-8-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## శ్రీరాంసాగర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో



**అక్షరటుడే, మెండోరా:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్రలో జోరుగా వానలు కురుస్తున్నాయి. అలాగే జిల్లాలోనూ నాలుగైదురోజులు వర్షాలు పడుతున్నాయి. దీంతో ఎస్సారెస్పీకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మహారాష్ట్రలోని విష్ణుపురి, బాలేగావ్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 84,998 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు, పూర్తి సామర్థ్యం 80.50 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1,071.90 అడుగుల వద్ద 26.567 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 1,077.60 అడుగుల వద్ద 38.799 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, ప్రస్తుతం సుమారు 12 టీఎంసీల మేర నీటి నిల్వ తక్కువగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 291 క్యూసెక్కులు కలిపి మొత్తం 822 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి వరద నీరు పెరుగుతుండటంతో శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ప్రాజెక్ట్ ఏఈ కొత్త రవి పేర్కొన్నారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సూచించారు. శనివారం 42వ డివిజన్‌లోని చంద్రశేఖర్ కాలనీలో పర్యటించారు. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా చంద్రశేఖర్ కాలనీలోని షేక్ ఫిరోజ్ ఇల్లు కూలిపోవడంతో ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షం కారణంగా ఇబ్బందులు ఏర్పడితే అధికారులను, స్థానిక కార్పొరేటర్లను సంప్రదించాలని సూచించారు. సంబంధిత అధికారులు కూడా లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. అనంతరం నెలవారి నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బెల్లాల్ శశాంక్, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, పసునూరి రాము, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్, శ్యామల సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.



**ఊరంత మెచ్చే పండుగకు కొన్ని గంటల సమయమే ఉంది.. అమ్మలను కొలిచేందుకు ఇందూరు ప్రజలు సిద్ధమయ్యారు. కులమతాలకు అతీతంగా నగరంలో ప్రతిఏటా నిర్వహించే ఊర పండుగకు ఎంతో ప్రత్యేకత ఉంది. నగరంలో ప్రతిఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ సంబరానికి పోలీసుల, మున్సిపల్ కార్పొరేషన్ శాఖలు సిద్ధమయ్యాయి.**

**- అక్షరటుడే, నిజామాబాద్ సిటీ**

# ఊర పండుగకు వేళాయె..

- ఊరేగింపునకు ఏర్పాట్లు చేసిన బల్దియా
- శారదాంబ గద్దె నుంచి ప్రారంభం
- కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఏర్పాటు

జిల్లా కేంద్రంలో ఆషాఢమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే ఆదివారం రోజు ఊరపండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దశాబ్దాల క్రితం నగరంలో ప్రజలకు కలరా, గత్తర, ప్లేగు వ్యాధులు ప్రబలాయని.. ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారని.. గ్రామ దేవతలు ఆగ్రహించడం వల్లే ఇలా జరిగిందని భావించిన గ్రామ పెద్దలు.. అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్టించాలని నిర్ణయించినట్లుగా పెద్దలు చెబుతారు. ఊర పండుగ నిర్వహించడం వల్ల వ్యాధులు తగ్గుముఖం పట్టాయని పేర్కొంటున్నారు. అప్పటినుంచి ప్రతిఏటా భక్తిశ్రద్ధలతో ఊరపండుగను నిర్వహిస్తున్నారు.

### ఒకే మామిడి చెట్టు నుంచి 14 దేవతామూర్తుల తయారీ..

ఊర పండుగ సందర్భంగా 14 అమ్మవార్ల ప్రతిమలను తయారుచేస్తారు. ఒకే మామిడి చెట్టు నుంచి సేకరించిన కర్రలతో వీటిని తయారుచేస్తారు. పొవుడాలమ్మ, ఐదు చేతుల పోచమ్మ, మహా లక్ష్మమ్మ, అడెల్లి పోచమ్మ, ఇద్దరు సార్గమ్మలు, అత్తరు పోశవ్వ, కొండల రాయుడు, బోగంసాని, ఆసు, రాట్నం, అంపుడు పోశవ్వ ఇలా మొత్తం 14 దేవతా మూర్తులను తయారుచేస్తారు. శనివారం సాయంత్రం వడ్లధాతిలో పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఖిల్లా శారదాంబ గద్దె వద్ద ప్రతిష్టిస్తారు. అక్కడి నుంచి ఊరేగింపు ప్రారంభమవుతుంది.

### 'సరి'కి ప్రత్యేకం..

నవధాన్యాలు, పిండితో కలిపి ప్రత్యేకంగా ఈ సరిని తయారు చేస్తారు. ఇందులో గ్రామదేవతలకు బలిచ్చే జీవాల రక్తం, పేగులను కలుపుతారు. ఈ సరిని ఇళ్లపై, పాడిపశువులపై చల్లితే అనారోగ్యాలు దరిచేరమని నగరవాసుల అపార నమ్మకం. దీంతో ఈ సరిని దక్కించుకునేందుకు ప్రజలు తరలివస్తారు.

### ఏర్పాట్లు పూర్తి

ఏడాదికి ఒకసారి నిర్వహించే ఊర పండుగకు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా ఖిల్లా శారదాంబ గద్దె నుంచి వివేకానంద చౌరస్తా, లక్ష్మీ మెడికల్ చౌరస్తా, గోల్ హనుమాన్ చౌరస్తా, వినాయక్‌నగర్, మహాలక్ష్మి నగర్, దుబ్బ తదితర ప్రాంతాల్లో పరిసరాలను, రోడ్లను శుభ్రం చేశారు. ఈ మార్గాల్లో మున్సిపల్ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి పారిశుధ్య పనులు చేయిస్తున్నారు.



### పోలీసు శాఖ సర్వసన్నద్ధం..

పండుగలో పోలీసు శాఖకు ప్రత్యేక స్థానం ఉంది. దేవతామూర్తులను తీసుకెళ్లే దారిలో ఇబ్బందులు లేకుండా చూసేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో సిబ్బందిని ఇప్పటికే నియమించారు. ప్రధాన ప్రాంతాల్లో వీరంతా భద్రత ఏర్పాట్లలో నిమగ్నమవుతారు. అలాగే దేవతామూర్తులను తీసుకెళ్లే వ్యక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రత్యేకంగా రోప్‌పార్టీ ఏర్పాటుచేశారు. 'సరి' కోసం తోపులాట జరిగే అవకాశాలు ఉంటాయి. పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

## అన్ని కుల సంఘాల సమన్వయంతో నిర్వహణ



నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఊరపండుగకు అన్నికుల సంఘాల సమన్వయంతో సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నాం. ఆయా కులసంఘాల పెద్దకాపులు, పెద్దమనుషులు, సర్వసమాజ్ కమిటీ సభ్యులు సహకరిస్తున్నారు. అలాగే పండుగ విజయవంతం చేయడానికి అధికారులు శ్రద్ధతో పనిచేస్తున్నారు. **– ఆదె ప్రవీణ్‌కుమార్, కో–కన్వీనర్, సర్వ సమాజ్ కమిటీ**

## ఊరపండుగను విజయవంతం చేయాలి



బండారు పోయడంతో ఊర పండుగ పనులు ప్రారంభమయ్యాయి. గతంలో నగరంలో వ్యాధులు ప్రబలడంతో గ్రామపెద్దలు గ్రామదేవతలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పండుగ చేశారు. అప్పటినుంచి క్రమం తప్పకుండా నగరంలో ఊర పండుగ జరుగుతోంది. ప్రజలంతా ఊరేగింపులో పాల్గొనాలి.

**– గాండ్ల లింగం, కమిటీ మెంబర్, సర్వ సమాజ్ కమిటీ**

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలకు రక్షణ: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోనే ప్రాణాలకు రక్షణ ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి పట్టణంలోని మరమ్మతుల అనంతరం ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కామారెడ్డి ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ట్రాఫిక్ ఎస్సై శ్రీ చంద్రశేఖర్ గౌడ్‌ను ఎస్పీ స్వయంగా ఆయన స్థానంలో కూర్చోబెట్టి అభినందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహన రద్దీ, ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు అవుట్‌పోస్ట్‌ను ఆధునీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, కామారెడ్డి టౌన్ సిఐ నరహరి, ట్రాఫిక్ ఎస్ఐ చంద్రశేఖర్ గౌడ్, టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఊరపండుగ సందర్భంగా వాహనాల దారి మళ్లింపు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఊర పండుగ నగరంలో కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ సందర్భగా ఊరేగింపు సందర్భంగా వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఖిల్లా చౌరస్తా నుంచి ఉదయం 6 గంటలకు ఊరేగింపు వివేకానంద స్టాచ్యూ, గాజులపేట, గురుద్వారా నుంచి లక్ష్మి మెడికల్, గోల్ హన్మాన్ నుంచి వేర్వేరుగా వినాయక్ నగర్, దుబ్బా వైపుగావెళ్లిపోతుంది. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుండి రాత్రి పది గంటల వరకు, బోధన్ వైపు నుంచి వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు బైపాస్ గుండా ప్రయాణించాల్సి ఉంటుంది. అలాగే ఆర్టీసీ బస్టాండ్ వెనుక నుండి రైల్వే స్టేషన్, ఎన్టీఆర్, జడ్పీ చౌరస్తా, కంఠేశ్వర్ మీ సేవ, కంఠేశ్వర్ బైపాస్ నుండి కలెక్టరేట్ గుండా అర్సపల్లి చేరుకొని బోధన్ వైపు ప్రయాణం సాగించాలి. అలాగే హైదరాబాద్, బాన్సువాడ నుండి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఎప్పటిలాగే ప్రయాణించాల్సి ఉంటుందని సీపీ తెలిపారు.

## ఊరపండుగ నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు: మేయర్



**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** నగరంలో ఆదివారం జరగనున్న ఊరపండుగకు ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయని మేయర్ ఉమారాణి పేర్కొన్నారు. నగర డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, సర్వసమాజ్ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆమె ఊరేగింపు వెళ్లే ప్రాంతాలను ఖిల్లా వద్ద శారదాంబ గద్దెను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రత కోసం సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు, హెల్త్ క్యాంపులు, తాగునీటి చలివేంద్రాలు, షామియానాలు సిద్ధం చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్, సర్వసమాజ్ కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్, కోకన్వీనర్ ఆదే ప్రవీణ్, కోఆప్షన్ మెంబర్ నరేందర్ సింగ్, కాంగ్రెస్ నాయకులు కరాటే రమేష్, బంటు బలరాం, ఆమ రాజు, లవంగ ప్రమోద్ పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీలో పూడికపై కేంద్రంతో చర్చిస్తున్నాం..: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**అక్షరటుడే, బాల్కొండ:** ఎస్సారెస్పీలో పూడిక తొలగింపు ప్రక్రియను చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి శ్రీరాంసాగర్‌ను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రాజెక్ట్‌లో పూడికతీతపై అతి త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలతో ఎగువ ప్రాంతం నుండి ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని (ఇన్‌ఫ్లో) పరిశీలించారు. ఎగువన గైక్వాడ్, విష్ణుపురి ప్రాజెక్టులు, బాలేగాం, బాబ్లీ బ్యారేజీలతో పాటు కడెం తదితర ప్రాజెక్టుల మిగులు జలాలు గోదావరి ద్వారా వచ్చి చేరుతుండటంతో ఎస్సారెస్పీలో నీటి మట్టం పెరిగిందని అధికారులు మంత్రుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికిప్పుడు వర్షాలు నిలిచిపోయినా, మరో 48 గంటల వరకు వరద నీరు ఇన్‌ఫ్లో రూపంలో వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 1091.00 అడుగులు, 80 టీఎంసీలకు గాను, ప్రస్తుతం 1072.30 అడుగులు, 27.376 టీఎంసిల వద్ద నీరు నిలువ ఉందన్నారు. ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చిన మంత్రులకు కలెక్టర్ భవేష్ మిశ్రా, సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఎస్సారెస్పీ సీఈ సునీతాదేవి తదితరులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఛైర్మన్ నగేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ మాజీ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అవమానించిన సీఎం క్షమాపణ చెప్పాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇంజినీరింగ్ విద్యార్థులను అవమానించిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి అమంద్ విజయ్ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు వంశీ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం అమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వమే వారిని కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసిన సీఎం వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, రాష్ట్రంలోని ఇంజినీరింగ్ విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం వంశీ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్న సీఎం వ్యాఖ్యలను బీజేవైఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకులు విపుల్ రావు, రాజ్ గణేష్, కలిగోట్ ప్రశాంత్, మహేష్, దినేష్, రఘు, కార్తీక్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షానికి దెబ్బతిన్న విద్యుత్‌స్తంభాలకు మరమ్మతులు



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని కాయితీ తండా గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా తండాలోని చెరువు కట్టపై 11 కేవీ విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో తండాలో విద్యుత్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఉప సర్పంచ్ వెంకటరావు డీఈ మల్లేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు మరమ్మతులు చేశారు.

## విద్యార్థుల సమక్షంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**అక్షరటుడే, లింగంపేట:** ఎమ్మెల్యే మదన్‌మోహన్ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బుర్ర నారా గౌడ్ ఆధ్వర్యంలో కేట్‌కట్ చేసి స్థానిక పాఠశాల విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ జంబి హనుమాన్ ఆలయ ఈవోగా రఘునాథ్



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ జంబి హనుమాన్ ఆలయ కార్య నిర్వహణ అధికారిగా కులకర్ణి రఘునాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జంబి హనుమాన్ దేవస్థానం ఈవోగా పనిచేసిన నాయకపు రాములు ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జానకంపేట్‌లోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కులకర్ణి రఘునాథ్‌ను ఆర్మూర్‌కు బదిలీ చేశారు. నూతన ఏవోకు దేవస్థాన ధర్మకర్తలు రేగుళ్ల సత్యనారాయణ, దొండి రమణ, నూతల నారాయణ, జింగిడి భోజన్న, చిట్యాల నవీన్‌లు స్వాగతం పలికారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఈవోను శాలువాతో సత్కరించారు.

## పదవీవిరమణ చేసిన అటెండర్‌కు సన్మానం



**అక్షరటుడే, నందిపేట్ :** డొంకేశ్వర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహించిన రామిల్లి భూమన్న పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ప్రసాద్, నవీపేట్ తహశీల్దార్ వెంకటరమణ తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో విశ్వకర్మ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామ్ మహిపాల్ చారి, డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గణేష్ గౌడ్, ఆర్ఐ నితీష్ రెడ్డి, తహసీల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అలుగెల్లిన పెద్ద చెరువు..


- బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు
- ప్రమాదం అంచున పర్యాటకుల ప్రయాణం
- సైడ్‌వాల్స్ నిర్మించాలని డిమాండ్



**వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు కుంటలు జలకలను సంతరించుకున్నాయి. నీటితో నిండుకుండల్లా మారుతున్నాయి. కామారెడ్డి పట్టణానికి తలమానికంగా ఉన్న పెద్ద చెరువు నిండిపోయి పర్యాటక శోభను సంతరించుకుంది.**

– అక్షరటుడే, కామారెడ్డి

జలపాతాన్ని తలపించేలా ఉన్న చెరువు పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రతి రోజు సాయంత్రం సమయంలో పెద్ద ఎత్తున ప్రజలు చెరువును తిలకించడానికి వస్తున్నారు. దాంతో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉండడంతో నీటి వద్దకు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. నీటి వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అయితే చెరువు వద్ద మూల మలుపు ప్రమాదకరంగా మారింది. సీసీ రోడ్డు చిన్నగా ఉండడంతో నీటి కాలువ పక్కన ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకుండా రోడ్డు ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. బైకు లేదా కారు అదుపుతప్పితే నేరుగా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని, తక్షణమే మూల మలుపు వద్ద సైడ్ వాల్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.






## ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం.. 119 మంది అనాథల గుర్తింపు



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆపరేషన్ ముస్కాన్-12 విజయవంతమైందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆపరేషన్ ముస్కాన్ ముఖ్య ఉద్దేశ్యం 18ఏళ్లలోపు అపహరించబడిన, తప్పిపోయిన, కార్మికులుగా ఉన్న బాలబాలికలను గుర్తించి వారిని సంరక్షణలోకి తీసుకోవడమేనని సీపీ పేర్కొన్నారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి అప్పగించడం లేదా.. తల్లిదండ్రులు లేని పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి అప్పగించడం జరుగుతుందన్నారు. అలాగే తల్లిదండ్రులు ఉన్న పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపర్చి, వారి ఆదేశాల మేరకు తల్లిదండ్రులకు అప్పగిస్తామని చెప్పారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉన్న నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో మొత్తం 119 మంది మగ పిల్లలను పట్టుకున్నామని సీపీ తెలిపారు. అలాగే నిజామాబాద్ డివిజన్ పరిధిలో 19 ఎఫ్ఐఆర్‌లు, ఆర్మూర్ డివిజన్ పరిధిలో 15, బోధన్ డివిజన్ పరిధిలో 14, మొత్తం 48 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. నిజామాబాద్ సబ్ డివిజన్ పరిధిలో 43 మంది బాలలను గుర్తించామని, బోధన్ సబ్ డివిజన్ పరిధిలో 49మందిని, ఆర్మూర్ బోధన్ సబ్ డివిజన్ పరిధిలో 27 మందిని గుర్తించినట్లు తెలిపారు.

## వీధి కుక్కల బెడదపై అధికారుల ప్రత్యేకచర్యలు



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు రోడ్లపై సంచరించేందుకు భయపడే పరిస్థితి నెలకొంది. ఇటీవల పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు దాడి చేయడంతో సుమారు 12 మంది గాయపడిన సంఘటనలు చోటు చేసుకోవడం ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఈ నేపథ్యంలో సమస్యను అత్యంత ప్రాధాన్యతతో తీసుకున్న బాన్సువాడ మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాసుల విజయ బాలరాజ్ ఆదేశాల మేరకు, మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ పర్యవేక్షణలో శనివారం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. బోనులు, వలలు, అవసరమైన పరికరాలతో కూడిన సిబ్బంది పట్టణంలోని వివిధ కాలనీలు, ప్రధాన రహదారులు, విద్యాసంస్థల పరిసరాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించారు. అనంతరం వాటిని పట్టుకున్నారు. పట్టుబడిన కుక్కలను భద్రంగా తరలించి అటవీ ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టారు.



## హనీషాకు లక్ష్మీ నృసింహస్వామి అవార్డు

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన విద్యార్థిని హనీషా అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటినట్లు నృత్య గురువు కవిత తెలిపారు. కాలనీలోని జవాజీ లింబాద్రి గౌడ్ మనుమరాలు అయిన హనీషా యాదగిరిగుట్టలో ఇటీవల జరిగిన నృత్య పోటీల్లో హనీషా పాల్గొని అద్భుత ప్రదర్శననిచ్చిందన్నారు. ఆమె నృత్య ప్రతిభకు గుర్తింపుగా నిర్వాహకులు ఆమెకు శ్రీ లక్ష్మీ నృసింహస్వామి అవార్డును అందజేశారు. చిన్న వయసులోనే ఇంతటి గౌరవాన్ని అందుకున్న హనీషా విజయంపై ఆర్మూర్ హౌసింగ్ బోర్డు కాలనీ వాసులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. లింబాద్రి గౌడ్ కుటుంబానికి అభినందనలు తెలిపారు. హనీషా భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కాలనీ ప్రజలు ఆకాంక్షించారు.




## శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** మోస్రాలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని హైందవ శివాజీ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం వారు తహశీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోస్రా హైందవ శివాజీ కమిటీ ప్రతినిధులు, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** గుండెపోటుతో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మృతి చెందాడు. ఈ ఘటన డిచ్‌పల్లి మండలంలో చోటు చేసుకుంది. డిచ్‌పల్లి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన న్యాస రాజేశ్వర్(66) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజేశ్వర్‌కు గుండెపోటు రావడంతో హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు. న్యాస రాజేశ్వర్ గతంలో రాంపూర్ సొసైటీ ఛైర్మన్, చాలా ఏళ్లుగా డీసీసీబీ, ఐడీసీఎంఎస్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఆకస్మిక మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. రాజేశ్వర్ అంత్యక్రియలను స్వగ్రామం కమలాపూర్‌లో నిర్వహించారు.

## నవీపేట్ రైల్వేగేట్ వద్ద గుంతల పూడ్చివేత

అక్షర టుడే కథనానికి స్పందన



**అక్షరటుడే, బోధన్:** నవీపేట్ రైల్వేగేట్ వద్ద గుంతలతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని నవీపేట్ పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని 'అక్షరటుడే'లో 'అలసత్వపు గుంతల్లో.. నలిగిపోతున్న నవీపేట్ ప్రయాణం' శీర్షికతో కథనం ప్రచురించగా రైల్వే శాఖ అధికారులు స్పందించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొనడంతో రైల్వే సిబ్బంది తక్షణమే ఆ గుంతలను తారుతో పూడ్చివేశారు. ఈ సందర్భంగా నవీపేట్ సర్పంచ్, ఉపసర్పంచ్ పాలక వర్గం సభ్యులు మాట్లాడుతూ.. చాలారోజులుగా గుంతల వల్ల అవస్థలు పడ్డామని.. 'అక్షరటుడే'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారన్నారు. అధికారులు గుంతలు పూడ్చివేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

## అప్పుల ఊబిలో ఇరుక్కొని యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం..

**అక్షరటుడే, కామారెడ్డి:** అప్పుల బాధలు తాళలేక యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం కామారెడ్డిలో చోటుచేసుకుంది. పోలీసులు.. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ కు చెందిన గతక రాజు (30), ఆరేళ్లుగా హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ గేమ్ టెక్నాలజీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం తండ్రి గంగాధర్‌కు పక్షవాతం రావడంతో చికిత్స కోసం దాదాపు రూ.15 లక్షల వరకు ఖర్చు చేశారు. ఆ డబ్బును బంధువుల వద్ద అప్పుగా తీసుకున్నారు. అప్పు తీర్చలేకపోతున్నానన్న మానసిక ఒత్తిడితో రాజు చాలాకాలంగా బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు చెప్పారు. గురువారం ఉదయం 10:20 గంటలకు కామారెడ్డి రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫాం వద్ద రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. రాజుకు వివాహం కాలేదని, ఇంటి బాధ్యతలన్నీ అతడే చూసుకునేవాడని తల్లి లక్ష్మి, అన్న శరత్ కన్నీటి పర్యంతమయ్యారు.

## నీట మునిగిన వరిని పరిశీలించిన శాస్త్రవేత్తలు



**అక్షరటుడే, కోటగిరి:** నాలుగైదురోజులుగా కురుస్తున్న వర్షాలకు కోటగిరి, పోతంగల్ మండలాల్లోని వరిపొలాలు నీటమునిగాయి. ఈ సందర్భంగా రుద్రూర్ ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తల బృందం కోటగిరి మండలం సైలంపూర్‌లో, పోతంగల్ మండలం తిర్మలాపూర్ పరిధిలో పొలాలను పరిశీలించారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని వీలైనంత త్వరగా తీసివేయాలని వారు పేర్కొన్నారు. పూర్తిగా కుళ్లిపోయిన మొక్కలను గుర్తించి, మళ్లీ నాటుకోవాలని రైతులకు సూచించారు. పసుపు రంగులోకి ఆకులు మారినట్లు గమనిస్తే 2శాతం యూరియా లేదా 19.19.19ను 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం తొలిచే పురుగు నివారణకు, నాట్లు వేసిన 25 రోజులకు రైతులు తప్పనిసరిగా కార్బోఫ్యూరాన్ 3జీ ఎకరాకు పది కిలోల చొప్పున వేసుకోవాలని వివరించారు. క్షేత్ర సందర్శనలో శాస్త్రవేత్తలు సమతా పరమేశ్వరి, సాయి చరణ్, మంజు భార్గవి, రమ్య రాథోడ్, ఏఈవో గౌస్, రైతులు గంగారాం, విఠల్, వీరబాబు, ఇస్మాయిల్, బీర్కూర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.